సాక్షి
యాదాద్రి భువనగిరి
ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024



విద్యావ్యవస్థ బాగుపడాలి

ప్రభుత్వ విద్యావ్యవస్థ బాగుపడినప్పుడే అంతరాలు తొలగిపోతాయని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. - 8లో



క్రీడలతో మానసికోల్లాసం

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ పేర్కొన్నారు. - 9లో



కార్పొరేట్‌కు దీటుగా ఎదగాలి

ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా ఎదగాలని కూరెళ్ల విఠలాచార్య, అందెశ్రీ, మున్సిపల్ చైర్మన్ రాజు పేర్కొన్నారు. - 9లో

న్యూస్‌రీల్

124 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన

భువనగిరి : నల్లగొండలోని డీఈఓ కార్యాలయంలో జరుగుతున్న డీఎస్సీ– 2008 అభ్యర్థుల సర్టిఫికెట్ పరిశీలన రెండో రోజు శనివారం కొనసాగింది. ఉమ్మడి జిల్లాలో 391 మందికి అభ్యర్థులు ఉండగా 124 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయ్యింది. ఇందులో మొదటి రోజు 96, రెండవ రోజు 28 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించినట్లు నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి తెలిపారు. ఆదివారం సెలవుదినం అయినప్పటికీ సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతుందని, అభ్యర్థులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

లెక్చరర్ల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక



ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్ల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

భువవనగిరి : ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం భువనగిరిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వి.కృష్ణారెడ్డి, కార్యదర్శి వై.రవీందర్, జాయింట్ సెక్రటరీగా సి.తులసి, మహిళా కార్యదర్శిగా జి.వెంకట్ లీలావతి, కోశాధికారిగా ఎం.వెంకటేశం, కార్యవర్గ సభ్యులుగా ఎం.హరిప్రసాద్, ఎస్.శ్రీనివాస్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల బలోపేతంతో పాటు అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఎన్నికల అధికారులుగా పి.వెంకటేశ్వర్లు, బి.సురేష్ వ్యవహరించారు.

ఎంబీసీల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్

యాదగిరిగుట్ట రూరల్ : ఎంబీసీల అభ్యుదయమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపేటి జైపాల్ పేర్కొన్నారు. శనివారం యాదగిరిగుట్ట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వడ్డెర కుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అత్యంత వెనకబడిన 36 కులాలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ కృషి చేస్తుందన్నారు. ఎంబీసీలు రాజకీయం చేయకుండా ఐక్యంగా ఉండాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా శివరాత్రి దానయ్యను నియమించి తమ వర్గానికి ప్రాధాన్యం కల్పించిన ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి మారయ్య, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రూప మహేశ్వరి, యూత్ అధ్యక్షుడు కొమ్మరాజు శేఖర్, జనరల్ సెక్రటరీ శివరాత్రి వెంకటేష్, రమేష్, వెంకటయ్య, యాదగిరి, బాలయ్య, నరేష్, స్వామి, శ్రీను పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం



లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి

భువనగిరి క్రైం : కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్‌లు దోహదపడుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు పేర్కొన్నారు. జిల్లా కోర్టులో శుక్రవారం జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. చిన్నచిన్న కేసుల రాజీకి లోక్ అదాలత్ మార్గం చూపుతుందన్నారు. ఆర్థిక స్తోమత లేని కక్షిదారులకు ఉచిత న్యాయ సహకారం అందజేయనున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా క్రిమినల్ 3,459, సివిల్ 17, ప్రీ లిటిగేషన్, టెలిఫోన్, రుణబకాయిలు, ఎస్‌బీఐ 73, ట్రాఫిక్ చలానా 7,517 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి మాధవిలత, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కవిత, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు హరినాథ్, కె.జయ, రేణుక, రజిని, నాగేంద్రమ్మ, జనార్దన్, ప్రభుత్వ న్యాయవాదులు సౌజన్య, చంద్రశేఖర్, న్యాయ సలహాదారులు జయపాల్ పాల్గొన్నారు.

నారసింహుడికి లక్ష పుష్పార్చన




యాదగిరిగుట్ట : ఏకాదశిని పురస్కరించుకుని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, వజ్రవైఢూర్యాలతో అలంకరించి వివిధ రకాల పుష్పాలతో అర్చన చేశారు. లక్ష పుష్పార్చనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా ఆలయ ముఖమండపం, ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవోత్సం తదితర పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

ఉత్సవమూర్తులకు పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పల్లె ఓటర్లు 5,20,297

తుది ఓటరు జాబితా విడుదల

- గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శన
- ఒకే కుటుంబంలోని ఓట్లన్నీ ఒకే వార్డు పరిధిలోకి..



సాక్షి, యాదాద్రి : పంచాయతీ ఓటర్ల తుది జాబితాను శనివారం ఎన్నికల సంఘం విడుదల చేసింది. తాజా గణాంకాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 5,20,297 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 2,59,167, మహిళలు 2,61,127, ఇతరులు ముగ్గురు ఉన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే ప్రకటించారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 1,960 మంది అధికంగా ఉండడం విశేషం. కాగా 2024 జనవరి 1 కటాఫ్ తేదీతో ప్రకటించిన అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితా ప్రకారమే గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితాను రూపొందించారు.

రెండు పంచాయతీలు పెండింగ్

తుది ఓటరు జాబితాను 426 గ్రామ పంచాయతీ కార్యాలయాలతో పాటు మండల పరిషత్ కార్యాలయాల్లో వార్డుల వారీగా నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించారు. ఇటీవల విడుదల చేసిన ముసాయిదా జాబితాపై పెద్ద ఎత్తున అభ్యంతరాలు వెల్లువెత్తడంతో జాబితాలో మార్పులు, చేర్పులు చేశారు. ఒకే కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే వార్డు పరిధిలోకి వచ్చే విధంగా జాబితాలు రూపొందించారు. ఇదిలా ఉండగా జిల్లాలో 426 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందిరానగర్, గుర్జవానికుంట పంచాయతీల ఓటరు జాబితాలు సాంకేతిక సమస్యలతో నిలిచిపోయాయి. వీటిని కూడా త్వరలోనే ప్రకటించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

డిసెంబర్‌లోపు ఎన్నికలు జరిగితేనే తాజా ఓటరు జాబితా ఉపయోగం

గ్రామ పంచాయతీ ఎన్నికలు 2024 డిసెంబర్‌లోపు జరిగితేనే ప్రస్తుతం ప్రకటించిన తుది ఓటరు జాబితా ప్రయోజనం ఉంటుంది. ప్రస్తుతం బీసీ కుల గణన చేస్తామని ప్రభుత్వం చెబుతుంది. కానీ, బీసీల లెక్కలు తీయడానికి ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఒకవేళ బీసీ కుట గణన ప్రారంభిస్తే ఎంత సమయం తీసుకుంటుందో తెలియని పరిస్థితి ఉంది.

మళ్లీ వార్డుల విభజన తప్పదా?

పంచాయతీల్లో వార్డుల ఓట్ల విభజనకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ 2023 డిసెంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల తుది ఓటరు జాబితాను పరిగణలోకి తీసుకుంది. అయితే 2024 ఏప్రిల్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల జాబితాలో ఓటర్లు పెరిగారు. అయితే పంచాయతీ ఓటర్ల తుది జాబితాలో లోక్‌సభ ఎన్నికల నాటి జాబితాను పరిగణలోకి తీసుకోకుండా రూపొందించారు. ఇదిలా ఉంటే బీసీ జనాభా లెక్కలు తేలే వరకు ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదు. ఇదే జరిగితే కేంద్ర ఎన్నికల సంఘం 2025 జనవరి 1 నాటికి మరో కొత్త ఓటరు జాబితా ప్రకటిస్తుంది. జనవరిలో ప్రకటించే జాబితాలో ఓటర్లు సహజంగానే పెరుగుతారు. 18 ఏళ్ల నిండిన వారు కొత్త ఓటర్లుగా నమోదు అవుతారు. కొత్త ఓటర్లు, చనిపోయిన, తొలగించిన ఓటర్లతో అనుబంధ జాబితా రానుంది. దీని ప్రకారం మళ్లీ వార్డుల విభజన చేయాల్సి ఉంటుంది. అంటే యంత్రాంగం పడ్డ శ్రమ వృథా అయ్యే అవకాశం ఉంది.

దరఖాస్తులను త్వరగా పరిష్కరించండి

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే



మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న అధికారులు

సాక్షి, యాదాద్రి : ధరణి, ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో సమావేశమై ధరణి, ప్రజావాణి దరఖాస్తులపై సమీక్షించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే దరఖాస్తుదారుకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రజాభవన్ నుంచి వచ్చిన వినతులపైనా దృష్టి సారించాలని సూచించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలోనూ జాప్యం ఉండరాదని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. కొత్తగా మంజరైన సబ్‌స్టేషన్లు, ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు స్థలాలు గుర్తించాలన్నారు. అలాగే భూగర్భ జలాల పరిరక్షణకోసం వాల్టా చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయం, పరిశ్రమలు, గృహ, వాణిజ్య అవసరాలకోసం బోర్లు వేయాలంటే వాల్టా చట్టం ప్రకారం అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. బోరు రిగ్గులను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకునేలా యజమానులకు ఆదేశాలు జారీ చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, ఆర్డీఓలు అమరేందర్, శేఖర్‌రెడ్డి, జిల్లా భూగర్భజల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జ్యోతికుమార్, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

‘హైడ్రా’తో భావితరాలకు ప్రయోజనం

- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఆక్రమణలు తొలగిస్తాం
- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



భువనగిరి పెద్ద చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

సాక్షి యాదాద్రి : హైడ్రా చట్టంతో కొందరికి నష్టం కలిగినా ఎంతోమందికి మేలు జరుగుతుందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం భువనగిరి పెద్దచెరువును ఆయన పరిశీలించారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రాను తీసుకువచ్చి గొప్ప పని చేశారని, ఇది భావితరాలకు ఉపయోగపడుతుందన్నారు. ఆక్రమణల వల్ల వర్షాలు, వరదలు వచ్చి వేలాదిమంది నిరాశ్రయులు అవుతున్నారని పేర్కొన్నారు. ఇటీవల భారీ వర్షాలకు ఖమ్మం, విజయవాడ నగరాలు జలమయం కావడం చూశామని, భవిష్యత్‌లో ఇటువంటి పరిస్థితులు రావద్దనే ఉద్దేశంతో హైడ్రా చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. భువనగిరి నియోజకవర్గంలోనూ హైడ్రా వస్తుందని, చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను గుర్తించి హద్దులు నాటేందుకు సర్వే చేయిస్తున్నట్లు తెలిపారు. ఇన్‌క్రెడిబుల్ ఇండియా వెంచర్ యాజమాన్యం భువనగిరి పెద్ద చెరువు చెరువు ఎఫ్‌టీఎల్‌లో రోడ్లు వేసిందన్నారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోనూ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాల వివరాలను సేకరించాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, టీపీసీసీ సభ్యుడు తంగెళ్లపల్లి రవికుమార్, మున్సిపల్ కమిషనర్ రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

భువనగిరిటౌన్ : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి (యూఎస్‌పీసీ)సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శనివారం కలెక్టర్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. రేషనలైజేషన్ జీఓ 25 నిబంధనలు మార్చాలని, అశాస్త్రీయమైన సర్దుబాటు ప్రక్రియ నిలిపివేయాలని, ఉపాధ్యాయుల సర్దుబాటుతో బదిలీ అయిన ఎస్‌జీటీలను రిలీవ్ చేయాలని కోరారు. అంతేకాకుండా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో, డీఈఓకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు సిలివేరు మహేష్, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు ముక్కెర్ల యాదయ్య, మైలారం సత్తయ్య, ఎం. వెంకటరెడ్డి, బోయ రాములు, మెతుకు సైదులు, ఎస్.లక్ష్మీనరసింహారెడ్డి, శ్రీనివాస్, భాస్కర్, కృష్ణమూర్తి, జి.వి.రమణారావు, లింగయ్య, బాలయ్య, కరుణాకర్, గోపాల్ కృష్ణ, ఎస్.పరమేశం, బి.నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ఎంజీయూ పీజీ పరీక్ష ఫలితాలు విడుదల

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పీజీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను శనివారం ఎంజీయూ రిజిస్ట్రార్ ఎ.రవి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాల్లో 72 శాతం ఉత్తీర్ణత సాధించగా మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్‌లో 56.27 శాతం, రెండో సెమిస్టర్‌లో 63.75 శాతం, మొదటి సెమిస్టర్‌లో 38.05 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఫలితాల వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి, అధ్యాపకులు అంజిరెడ్డి, అడిషనల్ కంట్రోలర్ సంధ్యారాణి, కోఆర్డినేటర్ భిక్షమయ్య పాల్గొన్నారు.

పీహెచ్‌డీ అభ్యర్థుల జాబితా విడుదల

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో 2022–23, 2023–24 సంవత్సరాలకు గాను పీహెచ్‌డీకి ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఎంజీయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్ ఆకుల రవి శనివారం విడుదల చేశారు. అత్యధికంగా ఎంబీఏలో 33 మంది, కామర్స్‌లో తొమ్మిది, బయోకెమిస్ట్రీలో ఇద్దరు, గణితంలో ఆరుగురు, బయోటెక్నాలజీలో నలుగురు, రసాయన శాస్త్రంలో ఆరుగురు, సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్‌లో ఇద్దరు చొప్పున ఎంపికై నట్లు తెలిపారు. వీరంతా సంబంధిత విభాగాల్లో అధ్యాపకుల పర్యవేక్షణలో సమకాలీన ఐచ్ఛిక అంశాన్ని ఎంచుకుని పరిశోధనలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

సాఫ్ట్‌వేర్ టు ఐపీఎస్
సేవలోనే సంతృప్తి



- శరత్‌చంద్ర పవార్, నల్లగొండ ఎస్పీ

‘మా నాన్న బాలాజీ పవార్. ఆయన డాక్టర్. ఎప్పుడూ ప్రజలతో మమేకం అయ్యేవారు. ఆయనను చూశాక నాకూ అలాగే ప్రజలకు దగ్గరగా ఉండి సేవ చేయాలనిపించేది. అంతేకాదు.. కలెక్టర్లు, ఎస్పీల గురించి నాన్న ఎప్పుడూ చెబుతుండే వారు. నాన్న స్ఫూర్తితోనే సివిల్స్ వైపు వచ్చాను’ అని చెప్పారు యువ ఐపీఎస్ అధికారి శరత్‌చంద్ర పవార్. నల్లగొండ ఎస్పీగా పనిచేస్తున్న ఆయన.. ఐపీఎస్ సాధించడానికి స్ఫూర్తినిచ్చిన అంశాలు, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉద్యోగ జీవితంలో అనుభవాలను ‘సాక్షి’తో పంచుకున్నారు.

- సాక్షి ప్రతినిధి, నల్లగొండ

- నాన్న స్ఫూర్తితో సివిల్స్ వైపు వచ్చాను
- సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేసినా ఏదో వెలితిగా ఉండేది
- ప్రజలకు దగ్గరగా ఉండాలని నిర్ణయించుకున్నా
- మూడో అటెంప్ట్‌లో ఐపీఎస్ సాధించాను
- బాధితులకు న్యాయం చేయడం ఎంతో తృప్తినిస్తోంది



నా బాల్యం సికింద్రాబాద్‌లో గడిచింది. పదో తరగతి వరకు మహీంద్రాహిల్స్‌లోని ఆక్జిలియం హైస్కూల్లో చదువుకున్నాను. నారాయణగూడలోని రత్న జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తిచేశా. ఆ తరువాత జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు సాధించి ప్రతిష్టాత్మక విద్యా సంస్థ అయిన ఐఐటీ బాంబేలో సీటు సాధించా. అక్కడ బీటెక్ పూర్తి చేశాక ఏడాది పాటు సాఫ్ట్‌వేర్ జాబ్ చేసి.. ఆ తర్వాత స్నేహితులతో కలిసి ఓ స్టార్టప్‌ను అభివృద్ధి చేసి, రెండేళ్లపాటు నిర్వహించా. అయినా, చిన్నతనంలోనే నా మనస్సులో నాటుకున్న సేవ అనే బీజం అక్కడ ఉండనీయలేదు.

- సాఫ్ట్‌వేర్ రంగంలో కేవలం నా కోసం నేను పనిచేస్తున్నట్లుగానే అనిపించేది. అక్కడ ప్రజలకు సేవ చేసే అవకాశం లేదు.
- ఐపీఎస్ అధికారిగా ఇప్పుడు ప్రజలకు నేరుగా సేవలు అందించగలుగుతున్నా. నా వద్దకు వచ్చే బాధితులకు న్యాయం చేకూరిస్తే ఎంతో సంతృప్తి ఇస్తుంది.

అధిక వేతనం.. అయినా లోటు

ఐఐటీ బాంబేలో బీటెక్ పూర్తయ్యాక క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో సన్‌టెక్ బిజినెస్ సొల్యూషన్స్‌లో జాబ్ వచ్చింది. త్రివేండ్రం వెళ్లి అక్కడ ఏడాదిపాటు ఆ సంస్థలో ఇన్నోవేషన్ అనలిస్ట్‌గా పనిచేశా. ఆ తరువాత స్టార్టప్ ప్రారంభించాం. ఫుడ్ ఎన్ బ్రేవరేజెస్ ఇండస్ట్రీలో (ఎఫ్ఎన్‌బీ) రిసోర్స్ ఆప్టిమైజేషన్ చేశాను. రెండేళ్ల పాటు కొనసాగింది. మొదట ఏడాది జాబ్ చేసినప్పుడు వేతనం బాగానే వచ్చేది. స్టార్టప్‌లో ఉన్నప్పుడు బాగానే ఉంది. అయినా ఏదో వెలితిగా ఉండేది. అక్కడ ప్రజలకు సేవ చేసే అవకాశం లేదు. సాఫ్ట్‌వేర్ రంగంలో కేవలం నా కోసం నేను పనిచేస్తున్నట్లుగానే అనిపించేది. నాన్న చూపిన బాటలో నడిచేందుకు సివిల్స్ వైపు మళ్లాను.

సాఫ్ట్‌వేర్‌లో ఉంటూనే సివిల్స్‌పై దృష్టి

స్టార్టప్‌లో ఉండగా సివిల్స్‌పై దృష్టి పెట్టాను. సాఫ్ట్‌వేర్‌తో వచ్చే డబ్బులతోనే సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యేవాడిని. రెండుసార్లు అటెంప్ట్ చేశా. ఇక మూడోసారి మరింత సీరియస్‌గా తీసుకొని పూర్తిగా సాఫ్ట్‌వేర్ రంగాన్ని వదిలేసి సివిల్స్‌కు సిద్ధమయ్యాను. 2015లో సివిల్స్ మూడోసారి రాశాను. 2016లో ఐపీఎస్‌కు ఎంపికయ్యాను. శిక్షణ పూర్తయ్యాక 2018 డిసెంబర్‌లో ఏటూరు నాగారం అదనపు ఎస్పీగా మొదటి పోస్టింగ్ వచ్చింది. ఆ తరువాత రామగుండం ఓఎస్‌డీ, మహబూబాబాద్ ఎస్పీగా పనిచేశా. ఆ తరువాత పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా, సెంట్రల్ జోన్ డీసీపీగా, నార్కొటిక్స్ ఎస్పీగా చేశా. అక్కడి నుంచి నల్లగొండ ఎస్పీగా వచ్చా.

బాధితులకు న్యాయం చేస్తే ఎంతో తృప్తి



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్ (ఫైల్)

ఐఏఎస్ లేదా ఐపీఎస్ అయితే నేరుగా ప్రజలకు సేవ చేయొచ్చు. ఐపీఎస్ అధికారిగా ఇప్పుడు ప్రజలకు నేరుగా సేవలు అందించగలుగుతున్నా. మా వద్దకు వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా చూడటం ఎంతో సంతృప్తి ఇస్తోంది. ఇప్పుడు వచ్చే జీతం.. అప్పుడు సాఫ్ట్‌వేర్‌లో వచ్చే జీతం కంటే తక్కువే అయినా.. ప్రజలకు సేవలందించడం ద్వారా ఇప్పుడు కలిగే తృప్తి ముందు అది తక్కువే అనిపిస్తుంది. మహబూబాబాద్‌లో ఎస్పీగా ఉన్నప్పుడు రెండు జాబ్ మేళాలు నిర్వహించాను. దాదాపు 1200 మంది గిరిజన యువతకు ఉద్యోగాలు ఇప్పించగలిగా. అది ఎంతో సంతృప్తి ఇచ్చింది. నల్లగొండలో కూడా త్వరలో జాబ్ మేళాలు నిర్వహిస్తాం. ప్రస్తుతం యువత గ్రూప్స్‌కు ప్రిపరేషన్‌లో ఉంది. అవి పూర్తయ్యాక జాబ్‌మేళా నిర్వహిస్తాం.

కుటుంబ నేపథ్యం ఇదీ..

ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తండ్రి బాలాజీ పవార్ ప్రభుత్వ వైద్యుడు. ఆయన ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాల్లో పనిచేశారు. ఎక్కువ కాలం నిజామాబాద్‌లో పనిచేశారు. ఆ తరువాత సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో వైద్యారోగ్య శాఖ అధికారిగా పనిచేశారు. తల్లి గృహిణి. శరత్‌చంద్ర భార్య పూజ ఇంటీరియర్ డిజైనర్. వారికి ఇద్దరు పిల్లలు. సంప్రీత్, ఐరా. ‘పోలీసు వృత్తిలో రోజూ ఏదోరకమైన ఒత్తిడికి లోనవుతుంటామని, ఎంత ఒత్తిడి ఉన్నా పిల్లలతో కాసేపు గడిపితే అన్నీ మర్చిపోతా..’ అంటున్నారు ఎస్పీ శరత్‌చంద్ర పవార్.

దాతలిస్తేనే.. క్రీడా పోటీలు!

- స్కూల్ గేమ్స్‌కు నిధుల కొరత
- దాతలు, పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్వహణ
- ముగిసిన మండల స్థాయి.. జిల్లా స్థాయి పోటీలకు ఏర్పాట్లు



ఆలేరులోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

భువనగిరి : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలకు నిధుల కొరత వెంటాడుతోంది. దాతల నుంచి సమకూర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లావ్యాప్తంగా ఈ నెల 10న ప్రారంభమైన క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. అక్టోబర్ మొదటి వారం నుంచి జిల్లా స్థాయి పోటీలు జరగనున్నాయి. నిధులలేమితో మండల స్థాయి పోటీల నిర్వహణకు ఇబ్బందులు ఎదురయ్యాయి. కొంత వరకు దాతల నుంచి సమకూర్చుకోగా మిగతా నిధులను పీడీలు భరించాల్సి వచ్చింది.

కొన్ని ఆటలతోనే సరిపెట్టారు

స్కూల్ గేమ్స్ నిర్వహణపై ఇటీవల ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. మండలస్థాయి పోటీలకు రూ.10 వేలు, జిల్లాస్థాయి పోటీలకు రూ.లక్ష, జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు పంపేందుకు రూ.50వేలు మంజూరు చేస్తున్నట్లు విద్యాశాఖ నుంచి ప్రకటనలు వెలువడ్డాయి. కానీ, ఆచరణలో కనిపించలేదు. దీంతో నిధులకోసం నిర్వాహకులకు తిప్పలు తప్పడం లేదు.నిధుల కొరత వల్ల కొన్ని పాఠశాలల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖోతోనే సరిపెట్టారు. నిబంధనల ప్రకారం కనీసం ఐదు క్రీడా పోటీలు నిర్వహించాలి.

అందని ప్రోత్సాహం

గత ఏడాది నిర్వహించిన స్కూల్ గేమ్స్ పోటీల్లో జిల్లానుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీల్లో జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. పోటీల నిర్వహణకు ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో పూర్వ క్రీడాకారులు, నిర్వాహకులు భరించారు. అందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి 5 లక్షల రూపాలయ వరకు రావాల్సి ఉంది. కానీ, ఇప్పటి రాలేదు.

అండర్–14,17 విభాగాల్లో..

స్కూల్ గేమ్స్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు కళాశాలల విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉంటుంది. అండర్–14 విభాగంలో 5నుంచి 9వ తరగతి వరకు, అండర్–17లో 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు పాల్గొనే అవకాశం ఉంటుంది. జిల్లాలో 712 ప్రభుత్వ, 136 ప్రైవేట్ పాఠశాలలు, 53 వరకు ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో నిర్వహించే మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే అకాశం ఉంటుంది.

పీడీలు, దాతల సహకారంతో నిర్వహిస్తున్నాం



స్కూల్ గేమ్స్ నిర్వహణకు నిధులు లేవు. పీడీలు, దాతల సహకారంతో నిర్వహిస్తున్నాం. జిల్లా స్థాయి క్రీడల నిర్వహణకు విద్యార్థుల నుంచి రూ.3లు వసూలు చేసి నిర్వహించే పద్ధతి కొనసాగుతుంది. మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహణకు సైతం నిధులు కేటాయించాలి.

–బాలకృష్ణ, ఎస్‌జీఎఫ్, జిల్లా కార్యదర్శి

క్లుప్తంగా

తాళం వేసిన ఇంట్లో దొంగతనం

చౌటుప్పల్ రూరల్: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటం గ్రామంలో శనివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్.లింగోటం గ్రామానికి చెందిన తూర్పింటి లక్ష్మమ్మ వారం రోజుల క్రితం తన ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. శనివారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండడం గమనించి లోనికి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలో దాచిన 6తులాల బంగారంతో పాటు 70తులాల వెండి, రూ.30వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి చౌటుప్పల్ పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

భువనగిరి క్రైం: మెడికల్ షాప్ ఎదురుగా పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని శనివారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. భువనగిరి పట్టణంలోని మెయిన్ రోడ్డుపై అలైడ్ మెడికల్ షాప్ నిర్వహిస్తున్న సర్వర్ తన ద్విచక్ర వాహనాన్ని షాప్ ఎదురుగా పార్కింగ్ చేసి లోపలికి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత వచ్చి చూడగా ద్విచక్ర వాహనం కనిపించలేదు. బాధితుడు భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కోదాడ వాసికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న జగిని ప్రసాద్

కోదాడరూరల్: కోదాడ పట్టణానికి చెందిన జగిని ప్రసాద్ ఢిల్లీలోని వరల్డ్ పీస్ ఆఫ్ యునైటెడ్ నేషన్స్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఆయన చేస్తున్న స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను గుర్తించి శనివారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రులు, నటి శిల్పాశెట్టి చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందజేశారు. కోదాడలో దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికులు సంతోష్‌బాబు, గోపయ్యచారి విగ్రహాలను ఏర్పాటు చేయడంలో ఆయన ఎంతో కృషిచేశారు.

బండరాయితో మోది యువకుడి హత్య

- చెర్కుపల్లి సమీపంలో ఘటన
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు
- మృతుడు కేతేపల్లి మండల వాసి


పరిశీలిస్తున్న డాగ్ స్క్వాడ్

డిండి: బండరాయితో యువకుడి తలపై మోది హత్య చేసిన ఘటన శనివారం డిండి మండలం చెర్కుపల్లి గ్రామ సమీపంలో జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డిండి మండలం కామేపల్లి గ్రామానికి చెందిన నకిరేకంటి సాయిలు, అంజమ్మ దంపతుల నాల్గో కుమార్తె రమాదేవికి కేతేపల్లి మండలం కొప్పోలు గ్రామానికి చెందిన శ్రీపతి జగదీష్(34)తో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. జగదీష్ హైదరాబాద్‌లో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. కొన్నేళ్ల పాటు వీరి సంసారం సాఫీగా సాగగా.. ఆ తర్వాత భార్యాభర్తల మధ్య గొడవలు జరగడం మొదలయ్యాయి. జగదీష్ తనను వేధిస్తున్నాడని రమాదేవి డిండి పోలీస్ స్టేషన్‌లో గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసింది. గ్రామ పెద్దలు, పోలీసులు తీరు మార్చుకోవాలని జగదీష్‌కు ఎంత చెప్పినా వినకపోవడంతో గత రెండున్నరేళ్ల నుంచి రమాదేవి పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో తన తల్లిదండ్రుల వద్దే ఉంటుంది. కాగా జగదీష్ శనివారం ఉదయం డిండి మండలం చెర్కుపల్లి గ్రామ స్టేజీ సమీపంలోని చెట్ల పొదల్లో రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉండగా.. పెద్దతండాకు చెందిన కాట్రావత్ మాధ్యా తన వ్యవసాయ పొలానికి వెళ్తూ గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, డిండి రూరల్ సీఐ ఎస్. సురేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి చేతులు కట్టేసి తలపై బండరాయితో మోది హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. క్లూస్ టీంను పిలిపించి వివరాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్ ఘటనా స్థలం నుంచి దాదాపు మూడు కిలో మీటర్ల దూరంలో బురాన్‌పూర్ తండా స్టేజీ వరకు వెళ్లి ఆగిపోయాయి. పెద్దతండా వాసి కాట్రావత్ రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

- రూ.10.50లక్షల నగదు స్వాధీనం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ రవి

సూర్యాపేటటౌన్: ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శనివారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ రవి విలేకరులకు వెల్లడించారు. తాజుద్దీన్ అనే పశువుల వ్యాపారి ఈ నెల 16న పశువులను కొనుగోలు చేసేందుకు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పశువుల సంతకు తన సొంత డీసీఎంను తీసుకుని వచ్చాడు. తనతో పాటు రూ.10.50లక్షల నగదు కూడా తీసుకొచ్చాడు. డీసీఎంలో నగదు పెట్టి పశువుల బేరం మాట్లాడుకొని వచ్చేసరికి డబ్బులు కనిపించలేదు. దీంతో సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టార. ఈ క్రమంలో తాజుద్దీన్ డీసీఎం నడిపించే కోదాడకు చెందిన జావిద్, హయత్‌అలీని పట్టుకొని విచారించగా తామే దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.10.150లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ రాజశేఖర్, ఎస్ఐ కుశలవ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంజీయూ పరీక్షల విభాగంలో ఇద్దరి కొనసాగింపు

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరీక్షల విభాగంలో మరోమూడు నెలల పాటు అసిస్టెంట్ కంట్రోలర్‌గా రామచంద్ర గౌడ్‌ను కొనసాగిస్తూ ఇన్‌చార్జి వీసీ నవీన్ మిట్టల్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ అల్వాల రవి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా కోఆర్డినేటర్‌గా భిక్షమయ్యను కొనసాగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

నల్లగొండ క్రైం: రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి అపహరించాడు. ఈ ఘటన నల్లగొండ పట్టణంలోని ముశంపల్లి రోడ్డులో శుక్రవారం రాత్రి జరిగింది. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని మారుతీనగర్‌కు చెందిన గడ్డం కమలమ్మ శుక్రవారం రాత్రి తన ఇంటి సమీపంలోని కిరాణా షాపు వద్దకు వెళ్లి సరుకులు తీసుకుని నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా.. గుర్తుతెలియని వ్యక్తి వచ్చి ఆమె మెడలోని 2 తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు


లాడ్జీల్లోని సీసీ టీవీ ఫుటేజీని పరిశీలిస్తున్న సీఐ రమేష్

యాదగిరిగుట్ట: పట్టణంలోని ప్రైవేట్ లాడ్జీలపై పట్టణ సీఐ రమేష్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లాడ్జీల్లోని సీసీ కెమెరాలు, బస చేసిన యాత్రికుల వివరాలను పరిశీలించారు. అనంతరం లాడ్జీల్లో బస చేసిన పలువురి వివరాలను, రికార్డుల్లో ఉన్న వివరాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. కచ్చితంగా లాడ్జీల నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ సూచించారు. ఆయన వెంట ఎస్ఐ అనిల్‌కుమార్, కానిస్టేబుల్స్ ఉన్నారు.

ఆలయంలో హుండీ చోరీకి యత్నం

రాజాపేట: మండల కేంద్రంలోని దుర్గామాత ఆలయం హుండీని శనివారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసేందుకు యత్నించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయం వద్ద ఉంటున్న బత్తెం లక్ష్మణ్ ఉదయం పని నిమిత్తం బయటకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చి చూసేసరికి ఆలయ హుండీ కనిపించలేదు. దీంతో స్థానికులకు సమాచారం ఇచ్చాడు. కొంతసేపటి తర్వాత పక్కనే ఉన్న వ్యవసాయ పొలంలోని చెట్ల పొదల్లో హుండీని రాళ్లతో పగులగొట్టే ప్రయత్నం చేసినట్లు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

ప్రకృతి వ్యవసాయంపై ఉచిత శిక్షణ

గరిడేపల్లి: మండలంలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో అక్టోబర్ మొదటి వారంలో 40మంది రైతులకు, యువతకు ఐదు రోజులు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కేవీకే ఇన్‌చార్జి సీనియర్ సైంటిస్టు అండ్ హెడ్ డి. నరేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కల్గిన రైతులు, గ్రామీణ యువత 7893989055 నంబర్‌ను సంప్రదించి తమ పేరు, గ్రామం, ఆధార్‌కార్డు వివరాలను కేవీకే మృత్తికా శాస్త్రవేత్త ఎ. కిరణ్ వద్ద నమోదు చేయించుకోవాలని సూచించారు.

గర్భిణి వైద్య పరీక్షలు చేయించుకుని వెళ్తూ..

ఆర్టీసీ బస్సులోనే ప్రసవం

- తల్లీబిడ్డను 108 వాహనంలో సూర్యాపేట ఆస్పత్రికి తరలింపు
- చికిత్స పొందుతూ శిశువు మృతి


ప్రసవించిన మహిళతో ఆర్టీసీ సిబ్బంది

మునగాల: ఆర్టీసీ బస్సులో గర్భిణి ప్రసవించి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను 108 వాహనంలో సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా శిశువు మృతిచెందింది. అనంతగిరి మండలం మొగలాయికోట గ్రామానికి చెందిన శిరవాసి వెంకటేష్, అలివేలు భార్యభర్తలు. అలివేలు గర్భంతో ఉంది. వెంకటేష్ బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య గర్భవతి కావడంతో ఆమెను తల్లిగారి ఊరైన కోదాడ మండలం రెడ్లకుంటకు పంపించాడు. శనివారం చెకప్ కోసం అలివేలు సూర్యాపేటకు వచ్చి తిరిగి ఆర్టీసీ బస్సులో రెడ్లకుంటకు వెళ్తోంది. మార్గమధ్యలో సూర్యాపేట మండలం దురాజ్‌పల్లి వద్దకు వెళ్లగానే అలివేలుకు పురిటినొప్పులు మొదలయ్యాయి. మునగాల మండలం మొద్దులచెరువు గ్రామ స్టేజీ వద్దకు చేరుకోగానే నొప్పులు తీవ్రం కావడంతో బస్సు డ్రైవర్ బస్సును రోడ్డు పక్కకు నిలిపివేశాడు. తోటి మహిళా ప్రయాణికులు అలివేలుకు పురుడు పోయగా.. ఆడబిడ్డకు జన్మనిచ్చింది. బస్సు డ్రైవర్ 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని అలివేలుకు, పుట్టినబిడ్డకు ప్రథమ చికిత్స నిర్వహించి సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే రాత్రి 10.30 సమయంలో శిశువు మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. తన భార్యకు నిండా ఏడు నెలలు కూడా నిండలేదని, చెకప్‌కు వెళ్తే వైద్యులు అంతా మంచిగా ఉందని చెప్పారని, ఇంతలోనే ఆమె ప్రసవించి ఆడబిడ్డకు జన్మనివ్వగా.. శిశువు మృతిచెందిందని వెంకటేష్ కన్నీరుమున్నీరయ్యాడు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

తిప్పర్తి: మండల కేంద్రం నుంచి నకిరేకల్ వెళ్లే రోడ్డులో డి-40 కాలువ సమీపంలో శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 30 ఏళ్లు ఉంటుందని, అతడి తల, ఛాతి, కాళ్లు, చేతులకు బలమైన గాయాలు కావడంతో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టినట్లు పోలీసులు భావిస్తున్నారు. తిప్పర్తి పంచాయతీ కార్యదర్శి అక్కి నర్సింహస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జమాల్ తెలిపారు.

ప్రభుత్వ విద్యావ్యవస్థ బాగుపడాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

శాలిగౌరారం: ప్రభుత్వ విద్యావ్యవస్థ బాగుపడాలని, అప్పుడే విద్యలో ఏర్పడిన అంతరాలు తొలగిపోతాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. శాలిగౌరారం మండలం మాధారంకలాన్ జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన ప్రధానోపాధ్యాయుడు బుగ్గోజు రామలింగాచారి పదవీ విరమణ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రామలింగాచారిని పూలమాలలు, శాలువా, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను పంపించే విధంగా తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంతో పాటు జీఓ 317 ద్వారా స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయలను స్థానిక జిల్లాలకు పంపాలన్నారు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసి గత బదిలీల్లో రిలీవ్ కాకుండా మిగిలిపోయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాలకుర్తి కృష్ణమూర్తి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాండ్ల వెంకటేశం, జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, శాలిగౌరారం, నకిరేకల్, కేతేపల్లి మండలాల ఇన్‌చార్జి ఎంఈఓలు సైదులు, నాగయ్య, రాజేంద్రప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయి

- అటవీ శాఖ కన్జర్వేటర్ శివాని డోగ్రా


నల్లగొండ జట్టుకు ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని అందజేస్తున్న శివాని డోగ్రా

నల్లగొండ: క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయని అటవీ శాఖ కన్జర్వేటర్ శివాని డోగ్రా అన్నారు. నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ, జనగామ జిల్లాల అటవీ అధికారుల స్పోర్ట్స్ మీట్‌లో గెలుపొందిన వారికి శనివారం ఆమె బహుమతులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎప్పుడూ ఉద్యోగ ఒత్తిడిలో ఉండే అధికారులకు జోనల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్స్ మానసికోల్లాసాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. కబడ్డీలో సూర్యాపేట జిల్లా మొదటి బహుమతి, నాగార్జునసాగర్, రెండో బహుమతి, వాలీబాల్‌లో సూర్యాపేట జిల్లా మొదటి బహుమతి, నల్లగొండ జిల్లా రెండో బహుమతి, క్రికెట్‌లో నాగార్జునసాగర్ మొదటి బహుమతి, నల్లగొండ జిల్లా రెండో బహుమతి సాధించాయి. నాలుగు జిల్లాల నుంచి 250 మందికి పైగా అటవీశాఖ అధికారులు ఈ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓలు ఎట్లా రాజశేఖర్, ఎం. నాగభూషణం, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ.. పలువురికి గాయాలు

మఠంపల్లి: రెండు కుటుంబాల మధ్యన జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మఠంపల్లి మండల కేంద్రంలో శనివారం వెలుగు చూసింది. ఎస్ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన తాటికొండ పాపిరెడ్డి, తొడేటి వెంకయ్యయాదవ్ మధ్యన ఇంటి ప్రహరీకి సంబంధించి పంచాయితీ నడుస్తోంది. శుక్రవారం ఉదయం ప్రహరీ దాటి తమ ఇంట్లోకి వరద నీరు వస్తోందని వెంకయ్యయాదవ్ కుటుంబ సభ్యులపై పాపిరెడ్డి కుటుంబ సభ్యులు దాడి చేశారు. ఈ దాడిలో వెంకయ్యయాదవ్, ఆయన భార్య వెంకటనర్సమ్మ, కోడలు గంగతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. బంధువులు వారిని హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అదేరోజు రాత్రి వెంకయ్యయాదవ్ బంధువులు కొంతమంది పాపిరెడ్డి కుటుంబ సభ్యులపై దాడి చేశారు. దీంతో పాపిరెడ్డికి కుటుంబ సభ్యులు వెంకట్‌రెడ్డి, జానకమ్మతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఇరు కుటుంబాల వారు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బస్సులో పోగొట్టుకున్న బ్యాగు అప్పగింత


బ్యాగును అప్పగిస్తున్న ఆర్టీసీ అధికారులు

భానుపురి (సూర్యాపేట): ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలు పోగొట్టుకున్న బ్యాగును ఆర్టీసీ అధికారులు తిరిగి ఆమెకు అప్పగించారు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లికి చెందిన గుగులోతు గీత శనివారం సూర్యాపేటలో ఆర్టీసీ బస్సు ఎక్కి మహబూబాబాద్‌కు బయల్దేరింది. ఆమె మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయిగూడెంలో దిగగా.. తన హ్యాండ్ బ్యాగ్‌ను బస్సులోనే మరిచిపోయింది. ఆ బ్యాగులో దాదాపు 4తులాల బంగారు పుస్తెల తాడుతో పాటు రూ.20వేల విలువ చేసే ఫోన్, రూ.4200 ఉన్నాయి. బ్యాగును గుర్తించిన కండక్టర్ శివరాత్రి భవాని బస్సు తిరిగి సూర్యాపేట డిపోకు రాగానే డిపో మేనేజర్‌కు విషయం తెలియజేసింది. గుగులోతు గీతకు ఫోన్ ద్వారా సమాచారం తెలియజేయగా.. ఆమె కుటుంబ సభ్యులను సూర్యాపేటకు పిలిపించి బ్యాగును అప్పగించారు. కండక్టర్ భవానీని డిపో మేనేజర్‌తో పాటు సిబ్బంది అభినందించారు.

మట్టపల్లిని సందర్శించిన భీమవరం పీఠాధిపతి


జీయర్‌స్వామికి స్వాగతం పలుకుతున్న ఆలయ ధర్మకర్తలు, అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహసింహస్వామి దేవాలయాన్ని భీమవరం శ్రీవిభూషిత శ్రీభాష్యకార సిద్ధాంత పీఠాధిపతి శ్రీరామచంద్ర రామానుజ జీయర్‌స్వామి శనివారం సందర్శించారు. ఆయనకు ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం రామానుజ జీయర్‌స్వామి గర్భాలయంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు సందేశమిచ్చారు. ప్రతి మానవుడు భక్తి భావం అలవర్చుకుని సమాజానికి సేవ చేయాలని అన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణమంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, వంశీకృష్ణమాచార్యులు, రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించు స్వామి!

- ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తడ్క జగదీశ్వర్‌గుప్త


యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జగదీశ్వర్‌గుప్త తదితరులు

యాదగిరిగుట్ట: తిరుపతి లడ్డూపై అబద్ధపు ప్రచారం చేస్తున్నందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీఎం చంద్రబాబునాయుడుని క్షమించి, మంచి బుద్ధి ప్రసాదించాలని వైఎస్సార్ అభిమాని, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తడ్క జగదీశ్వర్ గుప్త యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని వేడుకున్నారు. శనివారం ఆయన యాదాద్రీశుడిని దర్శించుకుని మాట్లాడారు. చంద్రబాబునాయుడు చేసిన పాపాలను ప్రక్షాళన చేయడానికి ఏపీ మాజీ సీఎం జగన్ ఇచ్చిన పిలుపుతో యాదాద్రి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసినట్లు వెల్లడించారు. తన ఐదేళ్ల పాలనలో ప్రజల్లో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న మాజీ సీఎం జగన్‌ను రాజకీయంగా దెబ్బ తీయడానికి చంద్రబాబునాయుడు, ఆయన టీం తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందని విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తిరుమల లడ్డూ విశిష్టతను చంద్రబాబునాయుడు దెబ్బతీస్తున్నారన్నారు. చంద్రబాబునాయుడు చేస్తున్న నీచ రాజకీయాలకు దేవుడే సరైన బుద్ధి చెబుతాడన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు విష్ణుప్రియా రెడ్డి తదితరులు ఉన్నారు.

తిరుమల పవిత్రతను దెబ్బతీసే కుట్ర

- తిరుమలకు హెరిటేజ్ నెయ్యిని సరఫరా చేసే ప్రయత్నం
- వైఎస్సార్‌సీపీ నాయకుడు వడ్లోజు వెంకటేష్


వెంకటేశ్వరస్వామి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న వడ్లోజు వెంకటేష్, నాయకులు

యాదగిరిగుట్ట: తిరుమల ఆలయ పవిత్రతను దెబ్బతీసే విధంగా ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్డీఏ ప్రభుత్వం కుట్ర చేస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకుడు వడ్లోజు వెంకటేష్ అన్నారు. తిరుమల పవిత్రను దెబ్బతీసిన ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు తగిన బుద్ధి చెప్పాలని యాదాద్రి ఆలయ వైకుంఠ ద్వారం వద్ద శనివారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తిరుమల వెంకటేశ్వరస్వామి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. తిరుపతి లడ్డూలో నెయ్యికి బదులుగా జంతువుల కొవ్వు వాడారంటూ చంద్రబాబు.. మాజీ సీఎం జగన్‌పై అపవాదు వేశారని, సీఎం హోదాలో ఉన్న వ్యక్తి తప్పుడు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. హెరిటేజ్ నుంచి నెయ్యిని తిరుమలకు సరఫరా చేసేందుకు ఈ కుట్ర పన్నారని మండిపడ్డారు. చంద్రబాబు నాయుడుకి దమ్ముంటే దీనిపై సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సైతం వైఎస్ జగన్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో ఎన్డీఏ ప్రభుత్వాన్ని తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి శిక్షిస్తాడన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చంద్రబాబు ప్రభుత్వం ఎలాంటి పనులు చేయక పోవడంతో ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను మళ్లించడానికి లడ్డూ అంశాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. కార్యక్రమంలో సుర్వి వెంకటేష్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, చిందకింద కృష్ణ, చిందకింది యాదగిరి, కిష్టయ్య నేత, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.